## నంబర్ ప్లేట్ లేకపోతే వాహనాలు సీజ్

తాండూర్, జూలై 4 : నంబర్ ప్లేట్ లేకుండా, నంబర్ సరిగా కనిపించక పోయిన వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని తాండూర్ సీఐ కే కుమార స్వామి హెచ్చరించారు. గురువారం మండల కేంద్రం ఐబీలో తాండూర్ ఎస్ఐ సీహెచ్ కిరణ్‌కుమార్‌తో కలిసి వాహన తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎస్ఐ కిరణ్ కుమార్, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

### హాజీపూర్‌లో 4 వాహనాలు సీజ్

హాజీపూర్, జూలై 4 : మండలంలోని గుడిపేట వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో నంబర్ లేని నాలుగు వాహనాలను సీజ్ చేసినట్లు హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ తెలిపారు.

### శ్రీరాంపూర్‌లో..

శ్రీరాంపూర్, జూలై 4: శ్రీరాంపూర్ ఏరియాలోని జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం సీఐ మోహన్, ఎస్ఐ సంతోష్‌ల ఆద్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. తనిఖీలో 30 టూవీలర్లు, ఆటో, లారీని పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

## సైబర్ నేరాలపై అవగాహన

కన్నెపల్లి, జూలై 4 : కన్నెపల్లి మండలంలోని పోలంపల్లిలో పోలీసుల నైట్ హాల్ట్ కార్యక్రమం నిర్వహించారు. వ్యసనాల దూరంగా ఉండాలని, సైబర్ నేరాలు, గుర్తు తెలియని వ్యక్తులపై అప్రమతంగా ఉండాలని గ్రామస్తులకు తాండూర్ సీఐ కుమారస్వామి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కన్నెపల్లి ఎస్ఐ గంగారాం, మాజీ సర్పంచ్ అంజన్న, గ్రామస్తులు, పోలీసులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్‌పై అవగాహన

దండేపల్లి, జూలై 4:దండేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఎన్ఎంఎంఎస్(నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్)పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బీసగోని శంకర్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్ఎంఎస్‌తో విద్యార్థులకు ఏడాదికి రూ.12వేల చొప్పున, నాలుగేళ్ల పాటు రూ.48వేలు ప్రభుత్వం అందిస్తున్నదన్నారు. ఎన్ఎంఎంఎస్ పరీక్ష కోసం 8వ తరగతి నుంచే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం తెలిపారు

# దొడ్డి కొమురయ్య పోరాటం స్ఫూర్తి దాయకం

నస్పూర్, జూలై 4 : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దొడ్డి కొమురయ్య పోరాటం స్ఫూర్తిదాయకమని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలకు అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్‌తో కలిసి హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం మహనీయులు, పోరాట యోధుల జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


నస్పూర్ : దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్


ఆసిఫాబాద్‌లో నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎమ్మెల్యే హరీశ్ బాబు

**దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు కృషి చేద్దాం**
**-కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూలై 4: తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య ఆశయాల సాధనకు కృషి చేద్దామని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు, డీఎఫ్‌వో నీరజ్ కుమార్‌తో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ తొలి సాయుధ పోరాట యోధుడిగా దొడ్డి కొమురయ్య నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, వెట్టిచాకిరీకి గురవుతున్న పేద, బడుగు, బలహీన వర్గాల విముక్తి కోసం పోరాడారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి, జిల్లా అధికారులు, ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, యాదవ సంఘం నాయకులు మల్లికార్జున్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులు పరిష్కరించాలి

• ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు


మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు

జైనూర్, జూలై 4 : పోలీస్ స్టేషన్లలో పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం జైనూర్, సిర్పూర్ (యూ) లింగాపూర్ మండలాల్లో పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. కేసుల పరిష్కారానికి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ఆదేశించారు. శాంతి భద్రతలు, ప్రజలకు అందించే సేవలపై ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని ఆదేశించారు. ఆయన వెంట ఎస్ఐలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## పసికందు మృతదేహంతో కుటుంబ సభ్యులు నిరసన

కాగజ్‌నగర్, జూలై 4: కాగజ్‌నగర్‌లోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో గురువారం పసికందు మృతి చెందగా వైద్యుల నిర్లక్ష్యమే కారణమని మృతదేహంతో ఎన్టీఆర్ చౌరస్తాలో కుటుంబసభ్యులు నిరసన తెలిపారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. దహేగాం మండలంలోని కల్వాడాకు చెందిన రమేశ్ భార్య సవితకు ప్రసూతి కోసం ఆపరేషన్ చేయగా పాప జన్మించింది. ఆ పసికందును పట్టణంలోని ఓ పిల్లల దవాఖానలో పరీక్షలు చేయించారు. గురువారం ఉదయం పసికందు మృతి చెందింది. ప్రసవానికి కొద్ది రోజులు గడువు ఉన్నప్పటికీ డబ్బుల కోసం ముందుగానే ఆపరేషన్ చేసి తన పాపను పొట్టనపెట్టుకున్నారని తండ్రి రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై నిరసన తెలుపుతున్న వారిని కాగజ్‌నగర్ పట్టణ పోలీసులు సముదాయించారు. అనంతరం ప్రైవేట్ దవాఖాన యాజమాన్యంతో చర్చలు జరిపి రూ.5 లక్షలు, వైద్య ఖర్చులు మాఫీ చేస్తున్నట్లు ఒప్పందం కుదిరినట్లు సమాచారం.


మృతదేహంతో నిరసన తెలుపుతున్న తండ్రి

## రేషన్ బియ్యం పట్టివేత

రెబ్బెన, జూలై 4: రెబ్బెన మండలం గంగాపూర్‌లో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి వెళ్లి సోదాలు నిర్వహించగా మహేశ్ ఇంట్లో 10 క్వింటాళ్ల బియ్యం పట్టుబడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

• కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూలై 4: వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఎఫ్‌వో నీరజ్ కుమార్, డీఆర్డీవో సురేందర్, డీపీవో భిక్షపతితో కలిసి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఈజీఎస్ ఏపీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 53 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా పై ఇంటింటా సర్వేను పూర్తి చేయాలని, పాఠశాలలలో నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సిర్పూర్ కాగితపు పరిశ్రమ దృష్ట్యా ఇక్కడి రైతులకు నీలగిరి, సుబాబుల్ చెట్ల పెంపకంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీవోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు

## మహారాష్ట్ర సరిహద్దుపై నిఘా పెట్టాలి

• మంచిర్యాల డీసీపీ భాస్కర్

వేమనపల్లి, జూలై 4 : మహారాష్ట్ర , తెలంగాణ సరిహద్దులో నిత్యం పోలీసు నిఘా ఉండాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ సూచించారు. మండలంలోని నీల్వాయి పోలీస్‌స్టేషన్ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈసందర్భంగా డీసీపీ మాట్లాడుతూ మహారాష్ట్రలో నక్సలైట్ల ప్రభావం ఉన్నందున ప్రాణహిత నది సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం యువకులకు వాలీబాల్ కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ శ్యామ్ పటేల్ , పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

**జన్నారం పోలీస్ స్టేషన్ తనిఖీ..**
జన్నారం, జూలై4: జన్నారం పోలీస్ స్టేషన్‌ను డీసీపీ ఏ.భాస్కర్ సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ రాజవర్ధన్, కానిస్టేబుళ్లు ఉన్నారు.


నీల్వాయిలో మొక్కలు నాటుతున్న డీసీపీ భాస్కర్

**లక్షెట్టిపేట పోలీస్‌స్టేషన్ తనిఖీ**
లక్షెట్టిపేట,జూలై 4: లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ భాస్కర్ తనిఖీ చేవారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి ఎస్సై చంద్రకుమార్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో తప్పులు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌తో పాటు సిబ్బంది క్వార్టర్స్‌ని పరిశీలించిన డీసీపీ సంతృప్తి వ్యక్తం చేశారు. డీసీపీ వెంట మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, సీఐ నరేందర్, ఎస్ఐ తానాజీ తదితరులు ఉన్నారు.

## పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

నస్పూర్, జూలై 4 : మంచిర్యాల పట్టణంలోని హమాలీవాడలోని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ డీఈవో యాదయ్యకు జాతీయ విద్యార్థి సమాఖ్య నాయకులు వినతి పత్రం అందించారు. గురువారం పాఠశాలను సందర్శించిన డీఈవోకు విన్నవించారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని, స్కావెంజర్‌లను నియమించాలని, ప్రహరీ నిర్మించాలని కోరారు. మధ్యాహ్న భోజనాన్ని వండేందుకు గ్యాస్ సిలిండర్ పొయ్యి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చేరాల వంశీ, సామల శివతేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

కాసిపేట, జూలై 4 : కాసిపేట మండల కేంద్రంలో రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లకు ప్రీ స్కూల్ కార్యకలాపాలపై శిక్షణ తరగతులను ప్రారంభించారు. కొత్త పాఠ్యాంశాలు, ఈసీసీఈ ఇంపార్టెన్స్, పిల్లల హాజరు పెంచడం, జూలై నెల కార్యక్రమాలపై వివరించినట్లు బెల్లంపల్లి సీడీపీవో ఉమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధిక, జ్యోతి, సుజాత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

**చింతలమానేపల్లి, జూలై 4 :** మండలంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో అంగన్‌వాడీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, మాస్టర్ ట్రైనర్లు కే అరుణ రెడ్డి, షాకీరా బేగం, సూపర్‌వైజర్ ఎం.శంకరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## పంట నమోదును పకడ్బందీగా నమోదు చేయాలి

మంచిర్యాల (ఏసీసీ), జూన్ 4: పంట చేలకు వెళ్లి సాగు చేస్తున్న పంటల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని అధికారులకు జిల్లా వ్యవసాయశాఖ అధికారి సురేఖ సూచించారు. గురువారం మంచిర్యాల డివిజన్ పరిధిలో వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పంట నమోదు, రైతు భరోసా, రైతు బీమా పథకాలు పలు సూచనలు చేశారు. అనంతరం మంచిర్యాల డివిజన్ పరిధిలోని విత్తనాలు, ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎరువుల విక్రయించేటప్పుడు రైతుల ఆధార్ నంబర్‌ను ఈపీవోఎస్‌లో నమోదు చేయాలని, రసీదులు వెంటనే అందించాలని ఆదేశించారు.

## రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కలెక్టర్‌కు వినతి

జన్నారం, జూలై 4: జన్నారం మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ జిల్లా సామాజిక కార్యకర్త తాళ్లపెల్లి రాజేశ్వర్ గురువారం కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం అందజేశారు.

## నియామకం

జైనూర్ జూలై 4 : ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవ్‌రావ్‌నియమితులయ్యారు. జీవో నం 3 తో పాటు ప్రభుత్వంలోని 29 శాఖలలోని జీవోలను చట్టబద్ధం చేసి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

## సేవ చేసిన వారు ఎప్పుడూ గుర్తుంటారు..

• సన్మాన కార్యక్రమాల్లో నాయకులు, అధికారులు


తాండూర్ : వీడ్కోలు సన్మానంలో తాండూర్ మండల పరిషత్ పాలకవర్గం, అధికారులు


కాసిపేటలో సన్మానిస్తున్న నాయకులు

తాండూర్, జూలై 4 : ప్రజాప్రతినిధులుగా నిస్వార్థంతో సేవ చేసిన వారిని ప్రజలు ఎప్పుడూ మరిచిపోరని తాండూర్ ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్, జడ్పీటీసీ సాలిగామ బానయ్య, అధికారులు అన్నారు. ఎంపీటీసీలు, ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుల పదవీకాలం ముగిసిన సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో గురువారం తాండూర్ మండల స్పెషల్ ఆఫీసర్ గజానంద్, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ ముఖ్యఅతిథులుగా హాజరు కాగా ఎంపీడీవో పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలు శాఖల అధికారులు పాల్గొని వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి వారిని ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు సిరంగి శంకర్, మొగిలి శంకర్, మాసాడి శ్రీదేవి, పెర్క రజిత, గోమాస స్వాతి, రెబ్బెన యశోద, సూరం రవీందర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు రహ్మత్‌ఖాన్, ఎంపీవో అక్తార్ మొహినొద్దీన్, ఎంఈవో వాసాల ప్రభాకర్, ఐకేపీ ఏపీఎం పోమానాయక్, ఈజీఎస్, ఐకేపీ సిబ్బంది, కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాప్రతినిధులకు సన్మానం**
కాసిపేట, జూలై 4 : పదవి కాలం ముగిసిన సందర్భంగా ఎంపీపీ రొడ్డ లక్ష్మి రమేశ్, ఎంపీటీసీలు మేరుగు పద్మ శంకర్, నవనందుల చంద్రమౌళి, కోఆప్షన్ సిరాజ్‌ఖాన్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో కాసిపేటలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రౌత్ సత్తయ్య, రైతు బంధు సమితి అధ్యక్షుడు దుర్గం పోశం, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మైదం రమేశ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి, జాకీర్, మడావి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


**జైనూర్‌లో..**
జై నూర్ జూలై 4: మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పదవి కాలం ముగిసిన సందర్భంగా ఎంపీపీ కుమ్ర తిరుమలా విశ్వనాథ్, వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, ఎంపీటీసీలు కుమ్ర భగవంత్‌రావ్, ఆత్రం జగతిరావ్, బొజ్జుపటేల్‌ను మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఈజీఎస్ ఏపీవో నగేశ్, జైనూర్ మేజర్ గ్రామపంచాయతీ ఇన్‌చార్జి ఈవో ఉదయ్ రాంప్రసాద్, మాజీ ఎంపీటీసీ జుగాధిరావ్. భగవంత్‌రావ్, మాజీ సర్పంచులు కుమ్ర శ్యామ్‌రావ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


**పెంచికల్‌పేట్‌లో..**
పెంచికల్ పేట్, జూలై 4 : పదవికాలం ముగిసిన సందర్భంగా ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు, మండల కో ఆప్షన్ సభ్యులను మండల కేంద్రంలోని రైతు వేదికలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీవో గంగా సింగ్, ఎంపీపీ జాజిమొగ్గ సుజాత, జడ్పీటీసీ సముద్రాల సరిత, ఎంపీటీసీలు రాజన్న, కమల మండల కో ఆప్షన్ సాజిత్ మాజీ సర్పంచులు జాజిమొగ్గ శ్రీనివాస్, సంజీవ్, చంద్రమౌళి, సుధాకర్, మధునయ్య, రాజన్న, నాయకులు సముద్రాల రాజన్న, తిరుపతి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**జడ్పీ చైర్‌పర్సన్‌కు సన్మానం**


మంచిర్యాలలో జడ్పీ చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

హాజీపూర్, జూలై 4 : మంచిర్యాల జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి పదవి కాలం ముగియడంతో ఆమెను జడ్పీ కార్యాలయ ముఖ్య కార్య నిర్వాహణాధికారి గణపతి, అధికారులు సన్మానించారు. జడ్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్లు బాలకృష్ణ, సత్యనారాయణ, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.


జైనూర్‌లో..


పెంచికల్‌పేట్‌లో..

## ప్రత్యేకాధికారుల బాధ్యత స్వీకరణ


ప్రత్యేక అధికారి యాదయ్యను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

**హాజీపూర్ మండల ప్రత్యేక అధికారి యాదయ్య**
హాజీపూర్, జూలై 4 : హాజీపూర్ మండల ప్రత్యేక అధికారిగా డీఈవో యాదయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఎంపీవో శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రజా పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ బొడ్డు భాగ్యలక్ష్మి, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, సిబ్బంది పూల మొక్కను అందజేసి శాలువాతో సన్మానించారు.

**దండేపల్లి ప్రత్యేకాధికారిగా..**
దండేపల్లి, జూలై 4 : దండేపల్లి మండల పరిషత్ ప్రత్యేకాధికారిగా పీ రవీందర్‌రెడ్డి(డీఎస్‌సీడీవో) గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రసాద్, ఈజీఎస్ ఏపీవో దుర్గాదాస్, సిబ్బంది సన్మానించి, పుష్పగుచ్ఛం అందించారు.

**జైపూర్ ప్రత్యేకాధికారిగా..**
జైపూర్, జూలై 4: జైపూర్ మండలపరిషత్ ప్రత్యేకాధికారిగా మంచిర్యాల జడ్పీ సీఈవో గణపతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎంపీడీవో సత్యనారాయణతో పాటు కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

**భీమారం మండల ప్రత్యేక అధికారిగా..**
భీమారం, జూలై 4: మండల ప్రత్యేక అధికారిగా జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారిగా చిన్నయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపీవో శ్రీపతి బాపు, మిషన్ భగీరథ ఏఈ ఈ. విద్యాసాగర్, కార్యాలయ పర్యవేక్షకుడు విజయ్ కుమార్, ఏపీవో జీనాత్, పంచాయతీ కార్యదర్శి వేముల శ్రీనివాస్ తదితరులు సన్మానించారు.

**కన్నెపల్లి మండల ప్రత్యేకాధికారిగా..**
కన్నెపల్లి, జూలై 4: కన్నెపల్లి మండల ప్రత్యేకాధికారిగా జిల్లా పరిశ్రమల శాఖ అధికారి హరినాథ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

**భీమిని మండల ప్రత్యేకాధికారిగా..**
కన్నెపల్లి, జూలై 4 : భీమిని మండల ప్రత్యేక అధికారిగా మైన్స్ అండ్ జియాలజీ ఏడీ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

**కాసిపేట మండల ప్రత్యేకాధికారిగా..**
కాసిపేట, జూలై 4 : కాసిపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల పరిషత్ ప్రత్యేకాధికారిగా డీటీడీవో గంగారాం బాధ్యతలను స్వీకరించారు. ఆయనను ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, తాజా మాజీ ఎంపీపీ రొడ్డ లక్ష్మీ రమేశ్, ఎంపీవో నాగరాజు, టైపిస్ట్ స్వామి శాలువాలతో సన్మానించారు.

**దహెగాం మండల ప్రత్యేకాధికారిగా ..**
దహెగాం, జూలై 4: మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా ఆర్అండ్‌బీ ఈఈ పెద్దన్న బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

**చింతలమానేపల్లి ప్రత్యేకాధికారిగా..**
చింతలమానేపల్లి, జూలై 4 : మండల ప్రత్యేక అధికారిగా జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు అధికారులు, సిబ్బంది అభినందించారు.

## షీటీం సేవలపై అవగాహన

కాగజ్‌నగర్, జూలై 4: షీటీం సేవలు, విధులపై మహిళలకు షీటీం ప్రతినిధి రమాదేవి గురువారం కాగజ్‌నగర్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలకు గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలన్నారు. సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగజ్‌నగర్ షీటీం సెల్ నంబర్ 8712670565లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సురేఖ, షీటీం సభ్యులు సునీత, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

**చెన్నూర్‌లో..**
చెన్నూర్ టౌన్, జూలై 4 : చెన్నూర్ పట్టణంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం (కేజీబీవీ) జూనియర్ కళాశాలలో షీటీంపై విద్యార్థులకు ఎస్ఐ శ్వేత గురువారం అవగాహన కల్పించారు. ఎవరైనా వేధిస్తే మహిళా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. చట్టాలు, నేరాల అప్రమత్తతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ అధ్యాపకులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి పుస్తెలతాడు చోరీ

దండేపల్లి, జూలై 4 : దండేపల్లి మండలంలోని లింగాపూర్‌లో గురువారం ఉదయం దొంగతనం జరిగింది. దండేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గుర్తు తెలియని వ్యక్తులు వృద్ధురాలు భూక్యా యమున ఇంట్లోకి చొరబడి ఆమె మెడల నుంచి రెండు తులాల బంగారు పుస్తెల తాడు లాగి ఎత్తుకెళ్లారు. వృద్ధురాలిని నెట్టివేసే క్రమంలో ఆమె గుమ్మంపై పడిపోవడంతో ఆమె తలకు గాయాలయ్యాయి. డాగ్ స్క్వాడ్ బృందాలు వచ్చి తనిఖీలు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గోమాత కు అంత్యక్రియలు

మంచిర్యాల అర్బన్, జూలై 4: మంచిర్యాల జిల్లా కేంద్రం సున్నంబట్టి వాడకు చెందిన కోంపెల్లి శ్రీనివాస్ 8 ఏళ్ల క్రితం పుంగనూరు జాతికి చెందిన ఆవును తీసుకువచ్చి పెంచుకున్నారు. గురువారం అనారోగ్యంతో మృతి చెందడంతో అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించినట్లు యజమాని శ్రీనివాస్ తెలిపారు.

## రాజ్యాంగాన్ని గౌరవించాలి

దండేపల్లి, జూలై 4: భారత రాజ్యాంగాన్ని, చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిన బాధ్యత ఉందని సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ (ఎస్‌జేడబ్ల్యూహెచ్‌ఆర్‌సీ)కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శి మామిడాల మనోహర్ పేర్కొన్నారు. జాతీయ చైర్మన్ కొప్పుల విజయ్‌కుమార్ నాయకత్వంలో మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం తెలంగాణ స్టేట్ వర్కింగ్ అధ్యక్షుడిగా దండేపల్లి మండలంలోని ముత్యంపేటకు చెందిన కారుకూరి మధుకర్‌కు నియామక పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో దత్తాగౌడ్, సుధాకర్, రాజేందర్, రమాగౌడ్, తదితరులు ఉన్నారు.

## మున్సిపాలిటీకి నిధులు కేటాయించాలి


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్, జూలై 4 : కాగజ్‌నగర్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ.25 కోట్ల నిధులు కేటాయించాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో పురపాలక పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం కిశోర్‌ను కలిసి విన్నవించినట్లు మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిరి హైమద్, పాలకవర్గ సభ్యులు తెలిపారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

## పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన


విగ్రహ ప్రతిష్ఠాపనలో ముదిరాజ్ కులస్థులు

దండేపల్లి, జూలై 4 : దండేపల్లి మండలంలోని నర్సాపూర్‌లో గురువారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహించారు. కరీంనగర్ జిల్లా రామడుగుకు చెందిన బైండ్ల పూజారులు, ముదిరాజ్ కులస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కొక్కిరాల రఘుపతిరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

## మడేలయ్య స్వామికి బోనాలు

చెన్నూర్ టౌన్, జూలై 4 : చెన్నూర్ పట్టణంలో రజక కులస్తులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి మడేలయ్య ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి సంవత్సరం బోనాలు సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రజక కులస్తులు, కుల పెద్దలు పాల్గొన్నారు.


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

## నడి రోడ్డుపై లారీ..5 గంటల పాటు ట్రాఫిక్..


కర్జెల్లి ముసలమ్మ గుట్ట అటవీ ప్రాంతంలో రోడ్డుపై నిలిచిపోయిన బస్సు వాహనాలు

చింతలమానేపల్లి, జూలై 4 : మండలంలోని కర్జవెల్లి గ్రామ సమీపంలోని ముసలమ్మ గుట్ట అటవీ ప్రాంతంలో ప్రధాన రహదారిపై కంకర లోడుతో గూడెం వైపు వెళ్తున్న ఓ లారీ గురువారం తెల్లవారుజామున రోడ్డుపై ఆగిపోయింది. రెండు వైపులా ఆర్టీసీ బస్సులతో పాటు పలు వాహనాలు ఐదు గంటల పాటు నిలిచిపోయాయి. ఏఎస్ఐ యాదవ్ అక్కడికి చేరుకొని వాహనాన్ని తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. డీజిల్ లేని కారణంగా వాహనం నిలిచిపోవడంతో డ్రైవర్‌పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899.
NT-325758

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677